ఎలాగుండేదో!!" అనిపించిందామెకి. "కానీ పైకి అనే ధైర్యం యిప్పుడు లేదు. ఆనాడు స్నేహితులకి భయపడింది. ఈనాడు సమాజానికి భయపడ్డాలి" అనుకుంది.

'అనూ నేను ఏకాకిని, నువ్వూ ఏకాకివి మనిద్దరం ఒకరికొకరున్నాము. ఇప్పుడు ఏ ఒక్కరికీ భయపడను. నా అండ నీకెప్పుడూ వుంటుంది. ఇది సినిమాల్లోలాంటి ప్రేమ, డైలాగులూ కావు. జీవితం విలువ తెలిసి అడుగుతున్న మాటలు. నీ రూపని నీకు తెచ్చివ్వలేను కానీ నీకు తోడుగా వుండి, నీ బాధ్యతని వహిస్తాను. నీకు నేనున్నాను కాదనకు అనూ! కాదనకు!! ఆ రోజులు మర్చిపో - ఆనాడు చేసిన తప్పుకు జీవితాంతం నాకు శిక్ష విధించకు. నా పశ్చాత్తాపానికి విముక్తి కలిగించు అనూ!" అంటు ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు డాక్టర్ హరీష్

* * *


విశాఖ సాహితి విజ్ఞప్తి

సుప్రసిద్ధ కథారచయిత శ్రీ భమిడిపాటి రామగోపాలం (భరాగో) సమగ్ర కథా సంకలనం 28.2.90 లోగా వెలువరిస్తున్నాము. నూరు రూపాయల వెలగల ఈ కథా సంకలనం 15.2.90 లోగా రు. 65-00 లు 'బ్యాంక్ డ్రాఫ్ట్'గా గాని, మని యార్డరు ద్వారా గాని పంపేవారికి మార్చి మొదటి వారంలో రిజిస్టర్డు పోస్టులో పంపగలం. భరాగో అభిమానులు, పాఠకులు ఈ సదవకాశాన్ని వినియోగించు కోగలరని విజ్ఞప్తి.

ఎ. యస్వీ. రమణారావు,
కార్యదర్శి, విశాఖ సాహితి,
26-14-388 వుడ్ యార్డ్ స్ట్రీట్,
విశాఖపట్టణం - 530 001




# సింహానికి కోపం వచ్చింది



సింహాన్ని జైల్లో పెట్టారు.

ఈ వార్త నన్ను ఆందోళనకు గురి చేసింది.

సింహం అంటే అడవిలో తిరిగేది కాదు. నరసింహాన్ని మేమంతా సింహం అని పిలుస్తాం. ఆ పోలిక అంతవరకే. అంతకుమించి 'సింహం'లో సింహం లక్షణాలు లేవు. అతన్తో నా పరిచయం ఈ నడుమే అయినా మేం మంచి స్నేహితులం అయ్యాం.

ముఖ్యంగా సింహం నా భవిష్యత్ పట్ల ఎంతో ఆశాభావం ప్రకటిస్తాడు. నేను కథలూ, కవిత్వం రాస్తుంటాను. ఇప్పుడిప్పుడే పత్రికల్లో వస్తున్నాయి. మా పరిచయం కూడా వాటి ద్వారానే

సింహానికి డ్రైక్లీనింగ్ షాప్ ఉంది. అది బాగా నడుస్తుందా అంటే సందేహమే. దాని మీద వచ్చే ఆదాయం ఆ కుటుంబానికి బొటాబొటిగా సరిపోతుందనుకుంటాను.

సింహానికి ఎన్నో బాధ్యతలున్నాయి. తనకు ముగ్గురుచెల్లెళ్ళు, ఓ తమ్ముడు ఉన్నారు. వారందరినీ చదివిస్తున్నాడు. ఇంతమందిని భరించటం ఆ షాపువల్లకావటం లేదు. అయినా ఎలానో నెట్టుకొస్తున్నాడు. ఇది అతని జీవితానికి చెందింది..

సింహం మానసిక ప్రపంచం విషయానికొస్తే అదెంతో భిన్నమైంది. అతను చదవని పుస్తకం అంటూలేదు. ఆధునికంగా వచ్చే నవలల నుండి వివిధ తత్వ వేత్తల రచనల వరకూ చదివాడు. చదవటం కాదు వాటిని కొని ఓ లైబ్రరీ తయారు చేశాడు. తనే నాకు ఒక్కో రచయిత రచనలు ఇచ్చి చదివిస్తున్నాడు నా కథల మీద తన అభిప్రాయం చెబుతాడు. అతనే కాదు సింహం చెల్లెళ్ళంతా తమ భావాలు చెబుతారు.

సింహం యువకుడు. ఇంకా పెళ్ళికాలేదు. తన పెళ్ళి గురించి ఎప్పుడూ ఆలోచించడనుకుంటాను. అతనికి పెళ్ళి కావలసిన ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఓ రకంగా సింహం వారందరికీ తండ్రిలాంటివాడు. తను ఆ కుటుంబం కోసం పదో తరగతితో చదువు మానేసి ఈ షాపు తెరిచాడు. అక్కడ కూర్చుని మిత్రుల్తో సంభాషణలు జరుపుతూ, నవ్వుతూ కాలం గడుపుతుంటాడు. అలాంటి సింహం....

ఎవరినో చంపాలని చూశాడనే నేరం మీద జైల్లో ఉన్నాడు!

ఓ సారినేనడిగాను

"సింహం నీకెప్పుడైనా కోపం వస్తుందా?

తిరిగి అదే చిరునవ్వు


"కోపం ప్రతి మనిషికీ వస్తుంది సార్. నేనూ మనిషినే.

అయితే ఎప్పుడూ కోపం తెచ్చుకోవటం అనేది ఓ వ్యసనంలాంటిది. ప్రపంచంలో జరిగే ప్రతి అరాచకం వెనక, పోనీ దారుణం అని దిగ్భ్రాంతి చెందే విషయం వెనకా కోపమే ఉంది. అది జయించగలిగిన నాడు మనం మహాత్ములమౌతాం. అయినా పేదవాడి కోపం పెదవికి చేటు కదా. నేనెవరి మీద కోపం తెచ్చుకోవాలి చెప్పండి. ఇంతమందిని కనేసి పోయిన నాన్నమీదా? మంచంలో పడుకొని మృత్యువు కోసం ఎదురుచూసే అమ్మమీదా? నా గుండెల మీద ఆడుకున్న చెల్లెళ్ళ మీదా? వాళ్ళు నన్ను ఇది కావాలని అడగరు. ఒక్కోసారి మేం చదువులు మానేస్తాం అంటారు. ఏదో పని చేస్తాం అంటారు. నేనున్నది ఎందుకు చెప్పండి? ఈ ఆదాయం చాలటం లేదంటారా, ఎలానో సర్దుకుంటాం. వాళ్ళంతా చదువుకోవాలి. అంతగా అయితే నలుగురు పిల్లలకి ట్యూషన్ చెప్పుకుంటారు. మనం పెళ్ళి చేయలేకపోవచ్చుగానీ బతకడానికి తగ్గ ప్రేరణ ఇవ్వక పోవటం న్యాయం కాదు" అన్నాడు.

అంతేకాదు. తను చదివిన సాహిత్యం నుండి కోపం తెచ్చిన విష ఫలితాల్ని గురించి ఎన్నో విషయాలు. నాకనిపించింది సింహం కోపాన్ని అధిగమిస్తున్నాడు. ఈ వయసులోనే, ఇప్పటికే అతను ఎంతో ఎదిగిపోయాడు. అతనికి అడుగడుగునా బాధలున్నాయి. అయినా ఎప్పుడైనా కృంగిపోయాడా? లేదు. ఎవరెవరో నవ్వుతూనే రకరకాల విసుర్లు విసురుతున్నా అదే చిరునవ్వు.

పి. చంద్రశేఖర్ ఆజాద్






నాకు తెలిసినంత వరకూ దరిద్రం ఆగ్రహం తెప్పిస్తుంది. ఓ రకమైన ప్రశాంతత కనీస జీవిత మున్నప్పుడే సాధ్యమౌతుంది. దరిద్రం అనుభవిస్తూ కూడా ప్రశాంతంగా ఉండగలగటం అరుదైన విషయం.

అందుకే సింహం అరుదైన వ్యక్తి.

సింహాన్ని నిశితంగా పరిశీలించినప్పుడే. అతని ప్రశాంతతకు కారణమేమిటి? అతను చదివే పుస్తకాలేనా? కావచ్చు! పూర్తిగా పుస్తకాలు మాత్రం కాదు. వాటి ప్రభావం ఓ మేరకుంటుంది. అయితేమరేమిటి? సింహం వెనకాల ఎవరైనా అజ్ఞాన యువతి ఉందా అని నా పరిశోధన. అలాంటిదేం లేదు. ఖచ్చితంగా చెప్పాలంటే ఈ విషయంలో తను నాకు ఏ విధమైన క్లూ కూడా ఇవ్వలేదు. అతను డైరీ రాస్తాడని నాకు తెలుసు. కేవలం ఆ డైరీలోనే తన అనుభూతుల గురించి రాసుకోవచ్చు. మరింకేమిటి కారణం?

నేననుకోవటం సింహం చెల్లెళ్ళు!

వాళ్ళు అతన్ని ఎంతగానో ప్రేమిస్తారు. ఈ ప్రపంచంలో వారికి 'అన్న'ను మించింది మరొకటి లేదు. నేను వారితో కూడా కొన్నిసార్లు మాట్లాడాను. నేను చాలామంది అన్నా చెల్లెళ్ళను చూశాను. వారి సంబంధాలు ప్రేమపూర్వకం కాదని నేనను. కానీ వాటిలో నాకు కావలసింది కనపడదు. వారంతా చక్కటి అన్నా చెల్లెళ్ళలా నటిస్తున్నారనిపిస్తుంది. ఏమైనా అలా ఉండటం కూడా గొప్ప విషయమే.

నేను చూసిన మరి కొందరు కేవలం ఆర్థిక పరిధిని మించి ఎదగనివారు. సింహం తన చెల్లెళ్ళకు ఓ మంచి స్నేహితుడు వాళ్ళూ అంతే. వారంతా నాలుగు రోజులు వస్తుండటాన్ని, ఓ వెన్నెల రాత్రిని, పూల తోటల పెంపకాన్ని, ఓ మంచి రచన్ని చదవటాన్ని ఎంతహాయిగా అనుభవించగలరో గమనించాక కొద్దిపాటి అసూయ కూడా కలిగింది. ఏదో రోజు తనను విడిచి వెళ్తారని ఆ అన్నయ్యకు తెలుసు. అసలది ఓ రకంగా తన కర్తవ్యంలో చిట్ట చివరి అంశం కూడా. అయినా వారెవరూ ఈ విషయం గురించి ఆలోచిస్తున్నట్లుండరు.

ఇదీ సింహం కుటుంబ పరిస్థితి. మరి గోవులాంటి సింహం, మనిషికి కోపం ఓ వ్యసనమనే సింహం, పేదవాడి కోపం పెదవికి చేటనే సింహం ఓ వ్యక్తిని చంపాలన్నంతగా ఎందుకు ఉద్రేకపడ్డాడు? మహాత్ముడిలాంటి సింహంలోని దానవత్వాన్ని రెచ్చగొట్టిందెవరు?

నాకు ఈ వివరాలు లభించలేదు. అందరికీ ఆశ్చర్యంగానే ఉంది. ముందు సింహాన్ని బయటకు తీసుకురావాలి. నేను సింహం మరో మిత్రుడ్ని కలిసాను. అతను చెప్పిన మాటల్నిబట్టి సింహం ఈ నడుమ తన పెద్ద చెల్లి పెళ్ళి విషయంలో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడట.

ఓ కుర్రాడు దొరకాడనీ, అతను గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడనీ, ఉద్యోగం ఇప్పించినా, లేదా ఓ పదివేలు కట్నం ఇచ్చినా సింహం చెల్లెల్ని పెళ్ళి చేసుకునే అవకాశాలున్నాయి. ఉద్యోగం ఇప్పించటం అనేది సింహం కలలో కూడా ఊహించని విషయం. ఈ పదివేలు కాక ఖర్చులకి మరో అయిదు వేలు అవసరమౌతాయి కాబట్టి ఎవరి దగ్గరైనా అప్పు చేయాలనుకుంటున్నాడని అతను తెలియ చేశాడు.

ఈలోపు ఇది జరిగిపోయింది.

నేను పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాను.

కటకటాల నడుమ యోగిలా ఉన్నాడు సింహం.

నన్ను చూడగానే తిరిగి అదే చిరునవ్వు!

నేను తిరిగి అతని ప్రశాంతతకు ఆశ్చర్యపోయాను.

నిజమేనా? సింహం ఎవరి మీదనైనా దాడి చేయటం నిజమేనా? ఏ నేరమూ ఎరగని ఈ యువకుడ్ని తెచ్చి ఇక్కడ పడేయలేదు కదా!

అక్కడ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్నాక సింహాన్ని మా ఇంటికే తీసుకెళ్ళాను.

నా శ్రీమతి ఇచ్చిన కాఫీ తాగాక మేడ మీదకెళ్ళాం.

సింహంతోపాటు నేనూ సిగరెట్ వెలిగించాను.

"ఇప్పుడు చెప్పు సింహం". అన్నాను

"ఏం చెప్పమంటావ్ బాస్". అన్నాడు నవ్వుతూ.

ఆ కళ్ళలో ఎక్కడో తడి మెరిసింది. నవ్వుతున్నా ఆ వదనంలో ఎక్కడో ఓ విషాద రేఖ ఉన్నట్లే నాకనిపించింది.

"ఎందుకిలా జరిగింది?" అన్నాను.

"నేనూ మనిషినే." అని ఆగాడు..... నవ్వుతూ అన్నాడు వెంటనే

"ఓ సారి నన్నడిగావ్ గుర్తుందా బాస్ నీకు కోపం వస్తుందా అని! చూశారుగా నాకు కోపం వస్తే శైథ్యాన్ని ఉరికొయ్యలే."

"ఇంతకూ ఎందుకంతగా ఆవేశపడింది?" సింహం కొంచెంసేపు మౌనంగా ఉన్నాడు.

"నీ వ్యక్తిగతమైన విషయమైతే మనం వదిలేద్దాం. మరో విషయం గురించి మాట్లాడుకుందాం." అన్నాను.

"ఇది నా వ్యక్తిగత విషయమే. అయితే మీకు చెప్పటానికి అభ్యంతరకరమైనదికాదు."

"అసలు నువ్వు ఎవరి మీదో తిరగబడ్డావంటే నేను నమ్మటం లేదు." అన్నాను సింహం నిశ్శబ్దంగా నవ్వాడు.

"నిజమే. నేను తిరగబడ్డాను. ఆ క్షణంలో వాడ్ని చంపేద్దామనుకున్నాను. నా దగ్గర ఎలాంటి ఆయుధం లేదు. అందుకే ఈ రెండు చేతుల్తోవాడి తల పుచ్చుకొని గోడకి కొట్టాను. తల పగిలి రక్తం కారుతుంటే వెర్రి కేకలు వేశాడు." సింహంలో తిరిగి ఉద్రేకం.

"ఏమిటంత ఆవేశపడుతున్నావ్. ఇప్పుడు వెళ్ళి హత్య చేస్తావా ఏమిటి? నీకు నేను బెయిల్ ఇచ్చానయ్యా స్వామి." అన్నాను.

"డోంట్ వర్రీ బాస్.... అదో బలహీనమైన క్షణం. అంతే." అన్నాడు.

"నాకు కొన్ని అనుమానాలున్నాయి సింహం. వాటిని తీర్చాలి నువ్వు." అన్నాను.

"అడుగు బాస్."

"నువ్వు కోపాన్ని జయించావనుకున్నాను. నా అంచనా పొరపాటు కావచ్చు. నీ ఉద్రేకానికి అతను బలయిఉంటే నువ్వో హంతకుడివిగా మిగిలేవాడివి కదా."

"సహజంగా."

"నీకు ఉరి శిక్షా, యావజ్జీవమా అనేది కాదు ఇక్కడి సమస్య. నువ్వు లేకపోతే నీ కుటుంబం ఏమైపోయేది? వాడ్ని గోడకేసి బాదుతున్నప్పుడు ఈ ఆలోచన వచ్చిందా?"

"చూడు బాస్. ఉద్రేకం మనిషిని పశువును చేస్తుంది. ఆ క్షణంలో ఏదీ గుర్తుకురాదు. గుర్తువస్తే అలాంటి పని చెయ్యలేం కూడా. అయితే ఒక్కటి మాత్రం చెప్పగలను. మా నాన్న జీవితంలో ఓడిపోయినా ఆ బాధ్యత నేను తీసుకున్నాను. నేను లేకపోయినా ఆ కుటుంబంలో ఎవరో ఒకరు తీసుకుంటారు.


అసలిది ఎందుకు జరిగింది..... వాడు నన్ను ప్రతి క్షణం పరిహసించాడు బాస్.... అయినా నవ్వుతూ భరించాను. నా దరిద్రాన్ని, నా బాధల్ని, నా అసహాయతను ఎన్నిరకాలుగా హేళన చేశాడో....అవన్నీ మీకు ఏదో రోజు చెబుతాను. మీరో పెద్ద నవల రాయొచ్చు ఈ జీవితంలో. నేను చంపబోయిన వ్యక్తిలో దుర్గుణం ఏమిటో తెలుసా బాస్... వాడిది నోరు కాదు. దానికి అడ్డూ, అదుపులేదు. నోటి దురద కూడా ఓ వ్యసనమే. ఏ వ్యసనమైనా అది ఆ వ్యక్తినే బలి తీసుకోదు మరి కొందరిని బలి తీసుకొని గాని వదలదు. నేను అంతవరకే చెప్పదలుచుకున్నాను." అని ఆగాడు.


నేను సింహాన్ని ఆ విషయం గురించి వత్తిడి చేయదలుచుకోలేదు.

"నీ సిస్టర్‌కి పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నావట కదా?" అన్నాను. సింహం కళ్ళలో ఓ నీటి పొర.

"అవును బాస్. మనిషికి పెళ్ళి కూడా ఓ అవసరమేకదా.... అప్పటికీ తనేమందో తెలుసా..... నా పెళ్ళికోసం బాధపడొద్దు. నాకు పెళ్ళి కాకపోయినా బాధలేదు. నిన్ను గౌరవించే ఏ కూలివాడ్ని చేసుకోమన్నా నా కిష్టమే అంది." సింహం కంఠం బొంగురుపోయింది. ఆ ఉద్వేగం తట్టుకోలేక కర్చీఫ్ ముఖానికడ్డంగా పెట్టుకున్నాడు.

"వాడు మా జీవితాల్ని నాశనం చేశాడు. మమ్మల్ని రోడ్ల మీదకీడ్చాడు. మా



అభిమానాన్ని ప్రతి క్షణం తన మాటల్తో గాయపరిచాడు. అన్నీ భరించాను. నేను నా గౌరవాన్ని చంపుకొని నా చెల్లి పెళ్ళి కోసం డబ్బును అప్పుగా ఇవ్వమని అడిగితే ఏమన్నాడో తెలుసా బాస్.....

"ఎందుకురా అంత తొందరపడుతున్నావ్? ఏ దాని క్యారెక్టర్ మంచిది కాదా?"

ఆ మాటలే బాస్ వాడన్నది... ఈ ప్రపంచంలో అందరూ అందుకే తమ బిడ్డల పెళ్ళిళ్ళ కోసం ఆరాటపడుతున్నారా? ఈ ప్రపంచంలో నాకుంది వాళ్ళే బాస్. నేను చేసింది మంచా, చెడా అనేది నేను చెప్పలేను. కానీ వాడిలాంటి వారున్నంత కాలం నాలాంటి వారూ ఉంటారు." అన్నాడు.

చాలాసేపు మా ఇద్దరి నడుమా నిశ్శబ్దం. సింహం వెళ్ళేముందు అడిగాను-

"ఇంతకూ ఎవరా వ్యక్తి?"

"మా మేనమామ బాస్." అన్నాడు నిశ్శబ్దంగా నవ్వుతూ!

* * *

"సంబరం"

"ఏంటి? ఇంత సంతోషంగా ఉన్నారు. మీ నెక్లెస్ దొరికిందా?" అడిగింది వర్మ.
"కాదు. ఎదురింటి సావిత్రి నెక్లెస్ కూడా పోయిందని" సంబరంగా చెప్పింది రాణి.

"నొప్పి"

ఇంతకూ మీరిచ్చిన టాబ్లెట్లు తలనొప్పికా? లేక కడుపు నొప్పికా?" అనుమానంగా అడిగాడు శ్రీను.
"ఇవ్వాళేసుకుని ఏ నొప్పి తగ్గిందో వచ్చి చెప్పు" చిరాగ్గా అన్నాడు డాక్టర్ శంకర్రావు.

ఇస్తా!!


"ఆ ధనిక యువకుడు ఓ సంవత్సరం తిరిగితే కారు ఇస్తానన్నాడు" శ్రీనుతో అంది వర్మ.
"ఓ... అంతేనా? నాతో ఓ సంవత్సరం తిరుగు. ఓ బుల్లిబాబునిస్తా" గొప్పగా అన్నాడు శ్రీను.

వెతుక్కుంటున్నా!

"పారిపోయిన భార్య' అనే నవల వ్రాసింది మీరేనా?" అడిగాడు ఓ పాఠకుడు.
"అవును" అన్నాడు రచయిత.
"ఇప్పుడేం చేస్తున్నారు మరి?"
"పారిపోయిన నా భార్యను వెతుకుతున్నా" దీనంగా చెప్పాడు.

-పద్మశ్రీ (మాటేశ్వరం)






# ఆఖరి దొంగతనం

ప్రతాప రవిశంకర్